# పెన్ పవర్

ప్రజాగళానికి అక్షర రూపం తెలుగు దిన పత్రిక

## తూర్పుగోదావరి

ఆదివారం | 15 ఏప్రిల్ 2018 పేజీలు 8





# చదువే ఆయుధం

- అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన విద్యావేత్త అంబేద్కర్
- సామాజిక చైతన్యమే ధ్యేయంగా పనిచేసిన భీమారావు
- ఆచరించతగిన అడుగుజాడలు ఆయనవే

కాకినాడ రూరల్, పెన్‌పవర్ : పూర్తిగా అననుకూల పరిస్థితులు, సామాజిక రుగ్మతలు, మూఢనమ్మకాలు పరాయి పాలనా దౌష్ట్యాలు నెలకొన్న రోజుల్లో చదువే ఆయుధంగా భావించి ముందుకుసాగి మహోన్నతమైన వ్యక్తిత్వంతో అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన డా. భీమారావు రాంజీ అంబేద్కర్ స్ఫూర్తి నేటితరానికి ఎంతో అవసరమని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. ఎస్. రామకృష్ణారావు పేర్కొన్నారు. సామాజిక చైతన్యం ధ్యేయంగా పనిచేసిన సంఘసంస్కర్తగా కొనియాడారు. జెఎన్‌టియుకె ప్రాంగణంలో శనివారం అలూమ్ని ఆడిటోరియంలో భారతరత్న

■ మిగతా 2లో



## చదువే ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

బాబా సాహెబ్ డా.బిఆర్.అంబేద్కర్ 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగకర్త, ఆర్థికవేత్త, తత్వవేత్త, న్యాయవాది అయిన డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జెఎన్‌టియుకె అధికారులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోకల్లా ఉత్తమమైన రాజ్యాంగాన్ని భారతదేశ ప్రజలకు అందించి బ్రిటీషు వారి మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి డా.బి.ఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. మానవత్వాన్ని పెంపొందించడంపై, కుల రహిత సమాజ నిర్మాణంపై ఆయన చేసిన ఎనలేని కృషి కీర్తించదగినది. సాంఘిక సంఘ సంస్కర్తగా బడుగు వర్గాలకు విద్య యొక్క ఉన్నతిని తెలియజేస్తూ విద్యను ఒక ఆయుధంగా ఉపయోగించుకుని తమ ఎదుగుదలకు బాటలు వేసుకునేలా ప్రోత్సహించిన అంబేద్కర్ కృషి ప్రశంసించదగినది తెలిపారు. డా.బి.ఆర్.అంబేద్కర్ మట్టిలో పుట్టిన మాణిక్యమని, ఎన్నో అవరోధాలను ఎదిరించి తనదైన శైలిలో విజ్ఞానాన్ని సంపాదించి పలు రంగాలలో తన ప్రతిభను చాటి భారతదేశ కీర్తిని ఇనుమడింపజేశారు. ఈయన గొప్పతనాన్ని మెచ్చి పాశ్చాత్య దేశమైన అమెరికాలోని కాలిఫోర్నియాలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని తెలిపారు. ఆయన బహిష్కృత అనే రాజకీయ పార్టీని నెలకొల్పి అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. గాంధీ, నెహ్రూ సిద్ధాంతాలకు వ్యతిరేక దిశగా పయనిస్తూ ఒక పర్వతశ్రేణిలా తన కఠోరమైన ఆలోచనలతో ధీకొన్నారన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సమ న్యాయం, స్వేచ్ఛా స్వాతంత్రాల కోసం ఆయన పాటుబడిన రీతి యువతకు ఆదర్శనీయమన్నారు. ఇటువంటి సభలలో మహాత్ముల యొక్క గొప్పదనాన్ని తెలిపే వ్రాతప్రతులను విద్యార్థులకు అందించగలిగితే వారికి పాత తరం వారిపై అవగాహన కల్పించి స్ఫూర్తి కలిగించ వచ్చునన్నారు. రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం మాట్లాడుతూ అంబేద్కర్ కార్మికుల హక్కుల కోసం, మహిళా సాధికారిత కోసం ఎనలేని కృషి చేశారన్నారు. అంబేద్కర్ అందరి వాడని, ఆయన బోధించిన సూత్రాలను విద్యార్థులు అనుసరించాలన్నారు. ప్రాచీన కాలంలో అశోకుడి పరిపాలనలో కుల వ్యవస్థ లేదని, భారతదేశం చరిత్ర గొప్పదని, బౌద్ధ మతం మానవత్వానికి పెద్ద పీట వేసిందన్నారు. ఇప్పటి వ్యవస్థకు బౌద్ధ మతం సిద్ధాంతాలు ఎంతో అవసరమని, అప్పుడే నిలకడైన పరిపాలనను ప్రజలకు అందించగలమన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.వి.వి.సుబ్బారావు మాట్లాడుతూ సమాజాన్ని మార్చగలిగేది విద్య ఒక్కటేనని, విద్య వలన అన్ని రుగ్మతలను నిర్మూలించవచ్చునన్నారు.

ఓఎస్‌డి ప్రొ.కెవి.రమణ మాట్లాడుతూ పుట్టింది ఏ కులమైనా, ఏ ప్రాంతమైనా ఆర్థికంగా చిదిగినా ఉన్నత స్థానానికి ఎలా చేరుకోవచ్చునో అంబేద్కర్ జీవితమే ఒక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ప్రొ.కె.వి.రమణ, ఎఫ్‌యుఆర్ డైరెక్టర్ ప్రొ.వి.శ్రీనివాసులు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు, జెఎన్‌టియుకె యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్ & ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ డా.బి.బాలకృష్ణ, డైరెక్టర్‌లు, ప్రోగ్రాం డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా డా.బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని అంబేద్కర్ విగ్రహానికి ఉపకులపతి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.